ఇండ్ల పట్టాలు ఇవ్వాలని వినతి

సైదాబాద్, నబంబర్ 18: ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీలో గుడిసెలు వేసుకొని జీవిస్తున్న పేద ప్రజలకు ఇండ్ల పట్టాలను మంజూరు చేయాలని, అదే విధంగా స్థానికంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ సోమవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్థానిక సీపీఐ కార్యదర్శి షేక్ మహమూద్, మహిళా నేత సక్రిబాయి, ఆటో యునియన్ సెక్రటరీ జంగయ్య వినతి పత్రాన్ని అందజేశారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఆర్కేపురం, నవంబర్ 18 : సరూర్‌నగర్ డివిజన్ వెంకటేశ్వర కాలనీలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో 40వ బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వర సామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అష్టోత్తర శత కలాభిషేకం, సహస్ర నామార్చన నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోరుపోలు భాస్కర్‌రెడ్డి, శాంతి ప్రసాద్, గండు ధనరెడ్డి, శ్రీమన్నారాయణ, బొగేశ్వర్‌రావు, సుబ్బరావు, శ్రీనివాస్‌రావు, ప్రతాప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, నబంబర్ 18: ఆస్మాన్‌ఘడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా మంగళవారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆస్మాన్‌ఘడ్ డివిజన్ డీఈ విష్ణువర్ధన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ సైదాబాద్ కాలనీ, 11కేవీ మున్సిపల్ సీ- క్వార్టర్స్,11కేవీ మలక్‌పేట ఫీడర్ల పరిధిలో ఉదయం 10. 30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, 11కేవీ జయనగర్, 11కేవీ ముంతాజ్ కాలేజ్, 11కేవీ ఎంసీ కాలనీ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2. 30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పైప్‌లైన్ల ఏర్పాటుకు చర్యలు

బైరామల్‌గూడలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చంపాపేట, నవంబర్ 18: నియోజకవర్గం సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. సోమవారం చంపాపేట డివిజన్ పరిధి బైరామల్‌గూడ ఓల్డ్ విలేజీలో ఎమ్మెల్యే పర్యటించారు. స్థానికులతో కలిసి అక్కడ కొనసాగుతున్న భూ గర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా బస్తీవాసులు తమ బస్తీలో గత జనాభాకనుగుణంగా ఏర్పాటు చేసిన 8 అంగుళాల భూగర్భ డ్రైనేజీ ప్రస్తుతం బస్తీలో పెరిగిన జనాభా వినియోగానికి సరిపోయేంత పైప్‌లైన్లు లేక పోవడంతో డ్రైనేజీ నీరు పొంగిపొర్లుతుందన్నారు. డ్రైనేజీ పైప్‌లైన్లను తొలగించి పెద్ద పైప్‌లైన్లను ఏర్పాటు చేసి డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని బస్తీవాసులు కోరారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే అక్కడి నుంచి ఫోన్ కాల్ ద్వారా పైప్ లైన్ల సైజ్ పెంచాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బస్తీలో పెరిగిన జనాభాకనుగుణంగా పైప్‌లైన్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గజ్జల మధుసూదన్‌రెడ్డి, చంపాపేట డివిజన్ అధ్యక్షుడు ముడుపు రాజ్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అందెపాక ఉమామహేశ్వర్, మహిళా అధ్యక్షురాలు రోజారెడ్డి, డివిజన్ మాజీ అధ్యక్షుడు చీర శ్రీనివాస్, నాయకులు బొంబాయి యాదయ్య, గౌరిదేవి రాజు, కల్పన, అనసూయ, జైపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

హయత్‌నగర్, నవంబర్ 18 : రోడ్డును కబ్జాచేసి అక్రమంగా చేపట్టిన నిర్మాణాన్ని కాలనీవాసుల ఫిర్యాదు మేరకు సోమవారం జీహెచ్ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ అధికారులు కూల్చివేశారు. హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని హుడాసాయినగర్ కాలనీ, రోడ్డు నెంబర్-5లో 150 ఫీట్ల పొడవుతో 4 ఫీట్ల వెడల్పుతో నిర్మాణదారుడు యథేచ్ఛగా కాలనీ రోడ్డును కబ్జాచేసి నిర్మాణాలు చేపట్టారు. జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఏమాత్రం పట్టించుకోవడం లేదని, చివరికి హైకోర్టు నుంచి ఆర్డర్ తీసుకొచ్చామని అధికారుల తీరు పై కాలనీవాసులు అసహనం వ్యక్తం చేశారు. ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్‌మీట్ పెట్టగా జీహెచ్ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి నామమాత్రంగా ప్రహరీని కూల్చివేసి వెళ్లిపోయారని ఆరోపించారు.

షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ

లబ్ధిదారులకు షాదీ ముబారక్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

సైదాబాద్, నబంబర్ 18 : చార్మినార్ మండల పరిధిలోని కట్టెలగూడ, ఫర్హాత్‌నగర్, గుడ్డిబౌలి, షాకాలనీ, చావునీ, చంచల్‌గూడ, అజంపురా, బాగే ఈ-జహరానా ప్రాంతాలకు చెందిన 116 మైనార్టీ మహిళలకు సంబంధించిన షాదీ ముబారక్ చెక్కులను మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలను పేద ప్రజలకు అందించే విధంగా కృషి చేస్తున్నామని, ఆడ పిల్లలు ఉన్న కుటుంబాలకు షాదీ ముబారక్ పథకం ఒక వరంలాగా ఉపయోగ పడుతుందన్నారు. అర్హులైన పేద వారందరికీ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొనే విధంగా ప్రజల్లో రెవెన్యూ అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ మండల రెవెన్యూ అధికారులు, ఎంఐఎం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

మన్సూరాబాద్, నవంబర్ 18: కార్తీక సోమవారం సందర్భంగా శివాలయాలకు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని పరమశివుడికి పూజలు నిర్వహించారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి సహారాస్టేట్స్‌కాలనీలోని శ్రీలలితా నాగలింగేశ్వర స్వామి దేవాలయం, సెంట్రల్‌బ్యాంకు కాలనీలోని శ్రీ ఉమానాగలింగేశ్వర స్వామి దేవాలయం, నాగోల్ డివిజన్ పరిధి శ్రీదుర్గాదేవి దేవాలయంతో పాటు తదితర ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సహారాస్టేట్స్‌కాలనీలోని శ్రీనాగలింగేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలోని ఉసిరి చెట్ల వద్ద భక్తులు దీపాలను వెలిగించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహారాస్టేట్స్‌కాలనీ ఉత్సవాల అడహక్ కమిటీ సభ్యులు తులశమ్మ, మేకల వెంకట్‌రెడ్డి, కాలనీవాసులు నాగస్వరాజ్యలక్ష్మి, వెంపటి సాయిబ్రిజేశ్, ఆలయ అర్చకులు నాగరాజు శర్మ తదితరులు పాల్గొన్నారు.

నాగలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఫ్రూట్ మార్కెట్ ఏజెంట్స్ సమస్యలు పరిష్కరించాలి

గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ఆర్కేపురం, నవంబర్ 18 : తెలంగాణ ఫ్రూట్ మార్కెట్ కమిషన్ ఏజెంట్స్ అసోసియేషన్ సమస్యలను పరిష్కరించాలని సోమవారం గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే మామిడి సీజన్‌లో బాట సింగారం మార్కెట్‌కు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కోహెడకు తరలించి అక్కడ తాత్కాలిక షెడ్లను నిర్మించి ఏజెంట్స్ సమస్యలను పరిష్కరించాలని చైర్మన్‌ను కోరినట్లు తెలిపారు. అందుకు చైర్మన్ సానుకూలంగా స్పందించి కోహెడలో నూతన మార్కెట్ నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో అతి త్వరలోనే షెడ్లను ఏర్పాటు చేయించడంతో పాటు నూతన మార్కెట్ నిర్మాణ శంకుస్థాపన కోసం కృషి చేస్తానని చైర్మన్ చెప్పినట్లు ఏజెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. గతంలో ఎంతో మంది మార్కెట్ కమిటీ చైర్మన్లుగా చేశారని, ఒక్కరూ కూడా తమ సమస్యలను పరిష్కరించలేదని రైతులు, ఏజెంట్స్ పేర్కొన్నారు. తెలంగాణ ఫ్రూట్ మార్కెట్ కమిషన్ ఏజెంట్స్ అధ్యక్షుడు మహ్మద్ అమ్జెద్, ఉపాధ్యక్షుడు క్రాంతి ప్రభత్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇమ్రాన్ అలీ, కోశాధికారి మాలే అనిల్ కుమార్, జాయింట్ సెక్రటర్సీ తోట నాగరాజు, మహ్మద్ అబ్దుల్ రహీం, ఈసీ మెంబర్స్ అశ్రప్, ఖయ్యూం తదితరులు ఉన్నారు.

పుస్తక పఠనంతోనే విజ్ఞానం

గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న జగన్ మోహన్ రెడ్డి

బడంగ్‌పేట,నవంబర్18: విద్యార్థులు అనుకున్న లక్ష్యం చేరుకోవాలంటే మొబైల్ వాడకం తగ్గించి పుస్తకాలు చదవాలని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ అన్నారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లో ఉన్న స్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రియాజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బీటెక్ విద్యార్థులకు ఇంపాక్ట్ ఆఫ్ బుక్ రీడింగ్ ఫర్ అకాడమిక్ ఎక్సలెన్స్ అంశం మీద వక్తలు ప్రసంగించారు. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ పుస్తక పఠనం అనేది విద్యార్థి జీవితంలో ఎంతో ముఖ్య మైందన్నారు. పుస్తకాలు చదవడం వలన జ్ఞానం వస్తుందన్నారు. బీటెక్ విద్యార్థులు పుస్తకాలు చదవాలన్నారు. పుస్తకంతోనే దినచర్య మొదలు కావాలన్నారు. పుస్తకాలు చదువుకున్నప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సూర్పి ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి సీహెచ్ జగన్ మోహన్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్ గిరిధర్, డాక్టర్ గాయిత్రీ, ప్రవీణ్ , దశరథ రెడ్డి, రవికుమార్ తదితరులు ఉన్నారు.

మున్సిపల్ గ్రౌండ్‌లో చెత్త తొలగింపు

పిచ్చి మొక్కలను సిబ్బందితో తొలగిస్తున్న శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

బడంగ్‌పేట, నవంబర్18: పిచ్చి మొక్కలు.. చెత్త కుప్పలు అనే కథనం నమస్తే తెలంగాణలో సోమవారం ప్రచురితం కావడంతో అధికార యంత్రాంగం కదిలింది. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రూ.250 కోట్లతో గ్రౌండ్ ఏర్పాటు చేయగా కాంగ్రెస్ సర్కార్‌లో ఆలనా పాలనా కరువైందనే కథనం చదవిన బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, కమిషనర్ సరస్వతి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. పక్కనే ఉన్న మున్సిపల్ గ్రౌండ్‌లో చెత్త, పిచ్చి మొక్కలు ఉంటే ఎందుకు పట్టించు కోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రౌండ్ అంతా క్లీన్ చేయించాలని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరికి ఆదేశాలు జారీ చేశారు. యాదగిరి దగ్గరుండి సిబ్బందితో పిచ్చి మొక్కలను తొలగించారు. పేరుక పోయిన చెత్తను ఆటోలలో తరలించారు. ఇక నుంచి మున్సిపల్ గ్రౌండ్ కు వాచ్‌మెన్ ఏర్పాటు చేయాలని మేనేజర్ నాగేశ్వర్ రావుకు మేయర్ ఆదేశాలు జారీ చేశారు. ఉదయం వాకింగ్ చేస్తున్న సమయంలో క్రికెట్ ఆడకుండా చూడాలన్నారు. వాకర్స్‌కు ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. యువకులు, పిల్లలు ఆడుకోవడానికి ఓ సమయం ఇవ్వాలన్నారు. రాత్రి సమయంలో గ్రౌండ్ గేటుకు తాళం వేయాలన్నారు. మరో సారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు.

రోడ్డు ఆక్రమణతో ఇక్కట్లు

బడంగ్‌పేట, నవంబర్18: అసలే చిన్న రోడ్డు. వ్యాపారులు రోడ్డును ఆక్రమించి షాపుల సామాన్లు రోడ్ల పై పెట్టడంతో ప్రయాణికులకు ఇబ్బందుల తప్పడం లేదు. బడంగ్‌పేట నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పోయే రోడ్డు వెంబడి టాటా లాంటి కంపెనీల వందల బస్సులు పోతుంటాయి. ప్రైవేట్ స్కూల్ బస్సులు ఉదయం సాయంత్రం వెళ్తుంటాయి. స్థానికులు ఎవరైనా ప్రశ్నిస్తే షాపుల యజమానులు ప్రజలపైకి తిరుగబడుతున్నారని స్థానికులు పేర్కొటున్నారు. ప్రతి రోజు షాపుల ఎదుట నీళ్లు పోయడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని వాహన దారులు ఆరోపిస్తున్నారు. గాంధీనగర్ బస్టాండ్ దగ్గర ఇటీవల నిర్మాణం చేసిన ఒక్క భవనానికి కూడా మున్సిపల్ కార్పొరేషన్ నుంచి అనుమతి లేదు. భవనాలకు అనుమతులు తీసుకోకుండా రోడ్డును కూడా కబ్జా చేసి షాపులలో ఉన్న సామాన్లు పెద్ద పెద్ద స్టాండులు ఏర్పాటు చేసి పెట్టడంతో వచ్చి పోయో వాహన దారులకు ఇబ్బంది తప్పడం లేదు. ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. లేదంటే గాంధీనగర్ చౌరస్తాలోనే ఆందోళన కార్యక్రమాలు చేస్తామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మలక్‌పేట, నవంబర్ 18: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని చాదర్‌ఘాట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చాదర్‌ఘాట్‌లోని లారీల అడ్డావద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు గమనించిన స్థానికులు సోమవారం పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి సిబ్బందితో చేరుకున్న ఎస్ఐ రవిరాజ్ మృతదేహాన్ని పరిశీలించగా, 35-40 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉందని, వారం రోజులక్రితం చనిపోయి ఉంటాడని భావిస్తున్నామని, మరణానికి గల కారణాలు పోస్టుమార్టం నివేదిక వస్తేగాని చెప్పలేమని ఎస్ఐ రవిరాజ్ తెలిపారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు,రిమాండ్

బడంగ్‌పేట, నవంబర్18: బీఎన్‌రెడ్డి టీచర్ కాలనీలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో చోరీ చేసిన నిందితుడిని సీసీ ఫుటేజీ ఆధారంగా పట్టుకున్నట్లు ఎస్ఐ సుధాకర్ సోమవారం తెలిపారు. అల్మాస్‌గూడ లక్ష్మీనగర్‌కు చెందిన వడ్ల శ్రీనివాస్ స్వస్థలం యంజీపూర్ షాద్‌నగర్ రంగారెడ్డి జిల్లా కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. అతడి నుంచి మూడు పంచలోహ విగ్రహాలు, ఒక బైక్, అయ్యప్ప స్వామి విగ్రహం, గణపతి విగ్రహం, సుబ్రమణ్యం స్వామి విగ్రహాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు.

రెడ్డి ఫౌండేషన్‌కు ఐదు లక్షలు అందజేత

మణికొండ రెడ్డి ఫౌండేషన్‌కు ఐదు లక్షలు అందజేసిన కాంటినెంటల్ దవాఖాన చైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి

మణికొండ, నవంబర్ 18: ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి తోడ్పాటు అందించాలని కాంటినెంటల్ దవాఖాన చైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి అన్నారు. మణికొండరెడ్డి ఫౌండేషన్ చేసే సేవా కార్యక్రమాలను గుర్తించి కాంటినెంటల్ హెల్త్ ఫౌండేషన్ ద్వారా ఐదు లక్షల రూపాయల చేయూ తను అందజేశారు. ఈ విరాళాన్ని మణికొండ రెడ్డి ఫౌండేషన్ ద్వారా ఆర్థికంగా వెనకబడిన కుటుంబాల్లోని ఉత్తమ విద్యార్థుల చదువుకు ఉపయోగించాలని సూచించారు. అంతేకాకుండా ఫౌండేషన్ గుర్తించిన విద్యార్థులకు స్కూల్ పుస్తకాలు, దుస్తులు, స్కూల్ బ్యాగులు నిమిత్తం ఇంకా విరాళాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు కూచికుల్ల నరేందర్‌రెడ్డి, ప్ర ధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, శ్రీపతిరెడ్డి, రా మసుబ్బారెడ్డి, శరత్‌రెడ్డి, బాల్‌రెడ్డి, సుభాష్ చంద్రారెడ్డి, కృపాకర్‌రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

కుస్తీ పోటీల టైటిల్ విజేత సుస్మిత్ ఫహిల్వాన్

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 18: అత్తాపూర్ డివిజన్, రాంబాగ్ మైదానంలో జరిగిన సర్దార్ వల్లభాయ్ పటేల్ కుస్తీ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీలు కుస్తీ పోటీల కమిటీ చైర్మన్ నారగూడెం మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌరిగే రాజు పైల్వాన్‌ల అధ్యక్షతన జరిగాయి. 6వ కుస్తీ పోటీల్లో టైటిల్‌ను సుస్మిత్ పైల్వాన్ కైవసం చేసుకున్నారు. రెండవ విజేతగా సాకేత్ పైల్వాన్, మూడవ స్థానంలో మహేందర్‌లు నిలిచారు. బాలకేసరి విజేతగా సాయిదర్శన్ యా దవ్ నిలిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రంగారెడ్డి జిల్లా రెజ్లింగ్ అధ్యక్షుడు యాదయ్యయాదవ్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌లు హాజరై విజేతలకు బహుమతులు అందజేశా రు.

విద్యార్థులకు అభినందనలు

బడంగ్‌పేట, నవంబర్18: విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా విద్యా బోధన ఉంటుందని నాగార్జున విద్యా సంస్థల చైర్మన్ విఠల్ రెడ్డి తెలిపారు. మీర్‌పేటలో ఉన్న నాగార్జున మాంటిసోరి ఐఐటీ ఒలంపియాడ్ వార్షిక క్రీడోత్సవాలను సోమవారం ఆయన ప్రారంభించారు. స్టార్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన ప్రొ కబడ్డీ జూనియర్ రాష్ట్ర స్థాయి పోటీలలో నాగార్జున పాఠశాల విద్యార్థులు విజయం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వంగా ఉందన్నారు. విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

కరాటేతో ఆత్మరక్షణ

విద్యార్థులకు బహుమతులు అందజేసిన ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్

చంపాపేట, నవంబర్ 18: ఆత్మ రక్షణకు కరాటే ఎంతో ఉపయోగపడుతుందని ఎల్బీనగర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. లింగోజిగూడ డివిజన్ సీఎం రోడ్డులోని టీఎస్ఆర్ శకుంతల అపార్ట్‌మెంట్‌లో గ్రాండ్ మాస్టర్ రాజు నాయక్ ఆధ్వర్యంలో, సోమవారం సీకే మార్షల్ ఆర్ట్స్ కరాటే గ్రేడింగ్ టెస్ట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో ఆర్ శాన్వినాయక్, శ్రీకీర్తి, ప్రణవ్, సందీప్‌కుమార్‌లతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారు. ముఖ్య అతిథులుగా ఎల్బీనగర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి హాజరై సత్తా చాటిన విద్యార్థులకు షీల్డ్‌లు, బెల్టులు అందజేశారు. మాస్టర్ కిశోర్, వి ఈశ్వర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అజయ్‌కుమార్ పారిక్

సైదాబాద్, నబంబర్ 18 : కరుణశ్రీ సేవా సమితి ఆధ్వర్యంలో వివిధ అంశాల్లో శిక్షణ పొందిన వారంతా ప్రయోజకులుగా తయారు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని వీహెచ్‌పీ అఖిల భారత సేవా ప్రముఖ్ అజయ్‌కుమార్ పారిక్ అన్నారు. సోమవారం ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని కారుణ్య సింధు ఆశ్రమ ఆవరణలో సోమవారం నిర్వహించిన ఉచిత కంప్యూటర్, జనపనార బ్యాగ్‌ల తయారీ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, యవతులు, యువకులు జ్యూట్ బ్యాగ్‌ల తయారీ, కంప్యూటర్ శిక్షణ తరగతుల్లో పాల్గొని శిక్షణ పూర్తి చేసుకొన్న వారందరూ ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ అఖిల భారత సేవా ప్రముఖ్ శ్రీనాథ్, సత్యం, కడారి సత్యమూర్తి, పుప్పాల వెంకటేశ్వరరావు, రాజేందర్, జైపాల్ రెడ్డి, మాణిక్ రావు, హరికిషన్, సజంకర్, దామోదర్ రెడ్డి, రేణుక, అరుణ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 18: ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఎప్పటికప్పుడు అభివృద్ధి పనులు చేపడుతున్నామని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దుర్గానగర్, లక్ష్మీగూడ, బృందావన్ కాలనీల్లో అభివృద్ధి పనులపై జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. నూతన సీసీ రోడ్డు, నూతన భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనులపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా బస్తీల ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తానని తెలిపారు. డివిజన్ అధ్యక్షుడు జనార్దన్, ఏఈ నర్సింహమూర్తి,రేణుక పాల్గొన్నారు.

అయ్యప్ప మహా పడి పూజ

పూజలో పాల్గొన్న కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి

ఆర్కేపురం, నవంబర్ 18 : సరూర్‌నగర్ డివిజన్‌లోని విజయ రామాలయంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మహేందర్‌యాదవ్, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అయ్యప్ప స్వామి మహ పడి పూజ మహోత్సవానికి మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గట్ల రవీంద్ర, చిక్కుల శివప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి, జ్ఞానేశ్వ ర్‌యాదవ్, గంగం కిశోర్, రఘుపతి, భాస్కర్, సైదులు తదితరులు ఉన్నారు.

నేడు కార్తీక పూజలు

ఆర్కేపురం, నవంబర్ 18 : ఆర్కేపురం ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ ఎంప్లాయిస్, సరూర్‌నగర్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీ రామకృష్ణాపురం పార్కులో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి ఆమలకవృక్ష పూజ(ఉసిరి వృక్ష) గోపూజ, శ్రీ అశ్వత్థ లక్ష్మీనారాయణ కల్యాణ మహోత్సవం, ప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు కాలనీ సొసైటీ ప్రధాన కార్యదర్శి శ్రీ రామారావు తెలిపారు.

ఆశ్రమ విద్యార్థులకు అన్నదానం

సైదాబాద్, నబంబర్ 18 : మలక్‌పేట్ బీ-బ్లాక్‌లోని ఫిన్ బదిరుల చిన్నారుల ఆశ్రమంలో బంజారా మహిళా సొసైటీ సభ్యులు సుజాత, హరిప్రియ, డాక్టర్ ఆనంద్ సంయుక్తంగా చిన్నారులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా ఆశ్రమంలో అన్నదానం నిర్వహించామన్నారు.

పేదలను ఆదుకోవాలి

కందుకూరు, నవంబర్ 18 : పేద ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని, 5 డిమాండ్లను తక్షణమే అమలు చేయాలని సమాజ్‌వాది పార్టీ నాయకులు కోరారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి ఉపాధి, ఇల్లు, భూమి, విద్య, వైద్యం అందించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర నాయకులు అబ్దుల్ రహమాన్, రవీందర్, జిల్లా నాయకులు అమరేందర్, కో కన్వీనర్ రాము, రంజిత్, శేఖర్, భాస్కర్, చక్రపాణి, ఓంకార్ పాల్గొని తమ డిమాండ్‌లను అమలు చేయాలని కోరారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు